క్లుప్తంగా

8న నగరేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 8న శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని సాయంత్రం శ్రీపార్వతి సమేత నగరేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ కార్యదర్శి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 9 గంటలకు నగరేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

చాపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రతి ఇంటికి తెలియజేయాలని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య సూచించారు. మండలంలోని చాపాడు, సోమాపురం, బద్రిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం నేను సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ త్వరలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికలలో సీఎం జగన్‌ను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జమాల్, రామాంజనేయులురెడ్డి, రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

'అపూర్వ' కలయిక

బద్వేలు అర్బన్ : వారంతా చిన్ననాటి స్నేహితులు.. 60 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఒకసారి కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1964–65 బ్యాచ్‌కు చెందిన ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిమ్మరాజు, పుల్లయ్య, వెంకటరాజు, అబ్దుల్ హమీద్, సుదర్శన్‌రాజు, సాంబయ్య, సుబ్బారావు, జయన్న, అంకిరెడ్డి, వెంకటేశ్వర్లు, రామరాజు, సుబ్బారెడ్డి, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

దువ్వూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలు వాటిని వినియోగించుకోవాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్ బాబు, హేమలత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన 380 మందికి డాక్టర్లు సురేష్‌బాబు, హేమలత, నాగయ్య, చంద్రమౌళి, శ్రీలలిత షుగర్, బీపీ, ఈసీజీ, థైరాయిడ్, కంటి తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజగోపాల్, సువర్ణ, విజకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

గోపవరం: మండలంలోని మల్లెంకొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. దేవదాయశాఖ, పాలకమండలి సమన్వయంతో ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే చైర్మన్ రెడ్డిపల్లి గోవిందరెడ్డి, ఈఓ శివయ్య బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు. బద్వేలు రూరల్ ఎస్ఐ రవికుమార్ బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండపైన గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు. బ్రాహ్మణపల్లె నుండి కొండ దిగువ వరకు వాహనాల రాకపోకలకు రోడ్డు సౌకర్యం కల్పించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు క్రైం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని గోపవరం మొదటి సచివాలయం, యూపీ ప్రభుత్వ పాఠశాల వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుదేష్ణ, హిమబిందు, తేజ వైద్య సేవలు అందించారు. సుమారు 354 మంది పలు రకాల వ్యాధులకు వైద్య శిబిరంలో చికిత్సలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దస్తగిరిరెడ్డి, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్యమిత్ర సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'వరద' బలవంతంతోనే టీడీపీలో చేరా

చాపాడు : రెండేళ్లుగా ప్రొద్దుటూరు టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్నానని, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి బలవంతం చేయటం వలన మైదుకూరు టీడీపీలో చేరుతున్నానని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గురివిరెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపేటలో బుధవారం జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మైదుకూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో గురివిరెడ్డి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా గురివిరెడి మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ రాజకీయాలపై ఆసక్తి లేదని, ప్రొద్దుటూరులో క్రియాశీకలంగా ఉన్న తనను వరద బలవంతం చేస్తే టీడీపీలో చేరానన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

- నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు


కల్యాణమండపాన్ని పారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి, మాజీ కౌన్సిలర్ జయలింగారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు పరిధిలో ఎక్కువ శాతం ముస్లింలు, దూదేకులు నివసిస్తున్నారని తెలిపారు. 17వ వార్డులో రూ.27,73,25,861 సంక్షేమ పథకాల రూపంలో అర్హులకు అందాయని, రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుకూరి రాజేష్ అనసూయ, హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, రాంభూపాల్ రెడ్డి, అశోక్‌రెడ్డి, కింగ్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, మాజీ కౌన్సిలర్ పాతకోట కృష్ణవేణి, నాగరాజు, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, నూరి తదితరులు పాల్గొన్నారు.

ఇమాం, మౌజన్లకు ఇళ్లు కట్టిస్తా

ప్రొద్దుటూరు పరిధిలోని ఇమాంలు, మౌజన్లకు తానే స్వయంగా ఇళ్లు కట్టి ఇస్తానని శివప్రసాదరెడ్డి ప్రకటించారు. అమృతానగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 64 మందికి ఎమ్మెల్యే ఇంటి పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వీరికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. మసీదుల్లో నిత్యం అల్లాను ప్రార్థించే వీరి కోసం కష్టపడి పోగొట్టుకున్న పట్టాలను తిరిగి మంజూరు చేయించామని, అందరికి ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు ఆటోనగర్ నన్నేసాహెబ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహాయంతో చాలా రోజులుగా ప్రయత్నించి ఎట్టకేలకు పట్టాలు మంజూరు చేయించామన్నారు.

13 వేల మందికి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని 13వేల మంది మహిళలకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక అనిబిసెంట్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి జగనన్న ప్రభుత్వంలో సుమారు 24వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. వీరిలో చాలా మంది రూ.35వేలు చెల్లించగా ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు మంజూరు చేసి ఇళ్లను నిర్మిస్తోందని తెలిపారు. ఇల్లు పూర్తి చేసి అప్పగించే బాధ్యత తనదేనని తెలిపారు.

24వేల మందికి ఇళ్ల పట్టాలు

జగనన్న ప్రభుత్వంలో రూ.200 కోట్లు వెచ్చించి 500 ఎకరాల భూమిని సేకరించి.. వీటిలో 24వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి 15,725 మందికి, మండల పరిధిలో 5,770 మందికి స్థలాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు 13,086 మందికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తున్నామన్నారు. రామేశ్వరం, మీనాపురం, బొల్లవరం జగనన్న కాలనీల్లో ఇప్పటికే 1679 ఇళ్లు పూర్తి చేశామని, 3,909 ఇళ్లకు స్లాబులు వేశామని, 1880 ఇళ్లు గోడల వరకు నిర్మించామని, 9,640 ఇళ్లకు పునాదులు నిర్మించామని వివరించారు. ఇంకా 4,369 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాల్సి ఉందన్నారు. అభివృద్ధి విషయంలో ముందున్నామని అన్నారు.

మరో జన్మ అంటూ ఉంటే మహిళగా జన్మించాలని కోరుకుంటున్నా

మరో జన్మ అంటూ ఉంటే తన తల్లి కడుపున స్త్రీగా జన్మించాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళను ఆది పరాశక్తిగా అభివర్ణించారు. మహిళా ఉద్యోగులు తమ విధులు నిర్వహిస్తూ.. మరో వైపు కుటుంబ బాధ్యతలను చక్కగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, వైఎస్సార్‌క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ కె.లావణ్య పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎంపీ

ప్రొద్దుటూరు క్రైం: మండలంలోని నంగనూరుపల్లె గ్రామంలో రూ.1.25 కోట్ల వ్యయంతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, జగనన్న మహిళా పాలడైరీ, కల్యాణ మండపాన్ని బుధవారం సాయంత్రం ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేశివప్రసాదరెడ్డిప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్‌యాదవ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శంకరయ్య, నడిపిగుర్రప్ప, సర్పంచ్ లక్ష్మీదేవి, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయండి

రాజుపాళెం : జగనన్న ప్రభుత్వంలో మేలు జరిగింటేనే ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని టంగుటూరు గ్రామంలో బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ యువనాయకుడు ముడియం గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో సారి సీఎంగా జగనన్నను, మూడోసారి ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రఘురామిరెడ్డి, నరసింహారెడ్డి, దస్తగిరి, సుభాన్, సుబ్బయ్య, సోమేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఉప ఎంపీపీ నారాయణరెడ్డి, కన్వీనర్ రాజారాంరెడి పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో నుండి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు డిపో నుండి 8న ఉదయం నుంచి లంకమలకు 12 బస్సులు, బ్రహ్మంగారిమఠానికి 12 బస్సులు, కాశినాయన జ్యోతి క్షేత్రానికి 9 బస్సులు, చాపాడు మండలం అల్లాడులపల్లెకు రద్దీని బట్టి పెద్ద సంఖ్యలో బస్సులను నడుపుతామని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

బ్రహ్మంగారిమఠం : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్, డాక్టర్ సంపత్‌కుమార్, ఎంపీహెచ్ఓ రెడ్డయ్య, ప్రసాద్, సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెల్త్ అసిస్టెంట్ మాధవనాయుడు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని మనస్తత్వవేత్త ఆనంద్ సిరిప్రగడ సూచించారు. మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలనీలో బుధవారం కేసీ పుల్లయ్య ఫౌండేషన్ సహకారంతో ఆలోచన విధానాన్ని మెరుగైన జీవితానికి మలుచుకోవడం ఎలా అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్‌ను పరిజ్ఞానం కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వృత్తిపరమైన అభివృద్ధి కోసం నూతన దృక్కోణాలను, వ్యూహాలను అలవర్చుకోవాలని సూచించారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


మహిళలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు: మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం దువ్వూరులోని సీవీవీ కల్యాణ మండపంలో ఇంటి స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులందరికీ రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసి మహిళలకు సర్వ హక్కులు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ప్రశంసించారు. అక్కాచెల్లెమ్మలు బాగుండాలనే ఉద్దేశంతో వారు ఆర్థికంగా ఎదగాలని, వారి కోసం అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత లాంటి ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టి వారి ఖాతాల్లో కోట్లాది రూపాయలు జమ చేశారన్నారు. మహిళా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కితాబిచ్చారు. మండలంలోని 913 మంది లబ్ధిదారులకు వారికి ఇచ్చే స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి 22 లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇచ్చామని గుర్తుచేశారు. 2014–19 చంద్రబాబు ప్రభుత్వంలో ఒక్క సెంటు స్థలం ఇవ్వలేదని విమర్శించారు. మైదుకూరు నియోజకవర్గంలో 7,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చామన్నారు. జగనన్న సీఎం అయ్యాక రూ.25,600 కోట్లు డ్వాక్రా రుణాలు మాఫీ చేసి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రజల కోసం అహర్నిశలు కష్టపడే సీఎం జగన్‌ను మనం మరో సారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నడిపి ఓబయ్య, మండల సచివాలయాల కన్వీనర్‌శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, జేసీఎస్ కన్వీనర్ ఓబుళరెడ్డి, సర్పంచ్ చెంద్రాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాం

చాపాడు: మైదుకూరు నియోజకవర్గంలో రూ.40 కోట్లతో అన్ని ప్రాంతాలకు రోడ్లు వేశామని, 98 శాతం హామీలను నెరవేర్చామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లెలో రూ.4 0లక్షల డీఎంఎఫ్ నిధులతో సీమెంట్ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.40 కోట్లతో రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, మండల అధ్యక్షుడు లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డి, డీఈఈ కంబగిరి, ఏఈ దాదాబాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు జైనులా పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

మైదుకూరు : మండలంలోని అట్లూరు కొత్తపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి సంబంధించిన భూమి పూజలో బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో రూ.60 లక్షలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఎ.ప్రసన్న లక్ష్మి, ఏపీ సుబ్బారెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముడుమాలలో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు బ్రహ్మంగారిమఠం మండలంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' అనే నినాదంతో ముడుమాల, పలుగురాళ్లపల్లె, చౌదరవారిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజల వద్దకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ప్రజల వద్దకు వెళ్లి మాకు ఓటు వేయాలని అడుగుతున్నామన్నారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని బూత్ కన్వీనర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడుమాల నాయకులు శీలం రామగురివిరెడ్డి, పెద్దిరెడ్డి, రనసింహులు, పలుగురాళ్లపల్లె నాయకులు దుగ్గిరెడ్డి, చౌదరవారిపల్లె నాయకులు లెక్కల నారాయణరెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ రాజానాయుడు, మణ్యం శంకర్‌రెడ్డి, జోగయ్య, సుబ్బరామిరెడ్డి, గాజుల రామయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షక అధికారి ప్రవీణ్‌చంద్

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల విధులకు సంబంధించి చేపట్టే ప్రతి అంశంలోను జాగ్రత్తగా, బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షక అధికారి, కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో.. జిల్లా అదనపు ఎన్నికల అధికారి, డీఆర్వో గంగాధర్ గౌడ్‌తో కలిసి కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్ కడప, ప్రొద్దుటూరు నియోజకవర్గాల ఈఆర్వోలు, సెక్టోరియల్ అధికారులతో ఎన్నికలలో నిర్వహించవలసిన బాధ్యతలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో సెక్టోరియల్ ఆఫీసర్ల బాధ్యత చాలా ముఖ్యమైనదన్నారు. సెక్టోరియల్ అధికారుల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రూట్ మ్యాప్‌ను, పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాల్లో ఇంకా ఏమైనా సౌకర్యాలు లేకుంటే వాటికి సంబంధించిన పనులను చేయించాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ నుంచి ఎంఈఓలు నిధులు ఇస్తారని పంచాయతీరాజ్‌శాఖ ద్వారా పనులు పూర్తి చేయాలన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్లు మళ్లీ ఒకసారి వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించి నివేదికను సంబంధిత ఆర్ఓకు పంపించాలన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్ల పరిధిలో ఉన్నటువంటి ఆర్ఓ, ఏఈఆర్ఓలు, తహశీల్దార్ లు, ఎంపీడీఓలు వివిధ రకాల టీమ్స్ లకు సంబంధించిన అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉండాలన్నారు. సెక్టోరియల్ అధికారులకు మెజిస్ట్రేట్ పవర్ కలిగి ఉంటుందని తెలిపారు. మీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో గత రెండు సాధారణ ఎన్నికల్లో ఎంసీసీ ఉల్లంఘన కేసులు, ఏమైనా ఇబ్బందులు జరిగివున్నాయా వంటి వాటిని పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఎక్కడైనా గతంలో కన్నా ఇప్పుడు మార్పుంటే వాటి గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి
- టీడీపీ నేతలను నమ్మవద్దు
- ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులోని ఎగువ బ్రాహ్మణవీధి, అబ్బరాతివీధిలో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీడీపీ తన మేనిఫెస్టోలో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు.

పేదల తలరాత మార్చిన ముఖ్యమంత్రి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల తలరాతలను మార్చారని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగంతో పాటు మహిళా సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, అల్లాబకాష్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గోపాలస్వామి, సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు పోలిరెడ్డి, యద్దారెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు శివయ్య, బిజ్జం రమణ, ఓబుల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అనిల్, రమణారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య మెమోరియల్ డయాలసిస్ సెంటర్‌ను బుధవారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ ముఖ్యకేంద్రమైన బద్వేలు పట్టణంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా కిడ్నీ సంబంధిత రోగుల ఇబ్బందులు తొలగనున్నాయని వారు అన్నారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన దివంగత ఎమ్మెల్యే డాక్టర్ వెంకటసుబ్బయ్య ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా డయాలసిస్ సెంటర్ కోసం అడిగిన వెంటనే 20 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు పరికరాలను, వైద్య సిబ్బందిని సమకూర్చిందని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డాక్టర్ జయసుబ్బారెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ వై.హిమదేవి, డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మార్కెటింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆడిటోరియాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల: పట్టణంలోని మాజీ సైనికుల కాలనీలో ఆర్మీ జవాన్లు నిర్మించుకున్న ఆడిటోరియం (బసంతర్ హాల్)ను బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించారు.

ఆనందంగా ఉంది

పోరుమామిళ్ల : మండలంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే రోజు మూడు పంచాయతీల్లో పలుపథకాలు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నచిన్న గ్రామాల్లోనే పట్టణస్థాయిలో వసతులు సమకూర్చడం ఒక్క జగనన్నకే సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైఎస్ ఎంపీపీ సీయం బాషా, సర్పంచులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వైద్యానికి ప్రాధాన్యత

బ్రహ్మంగారిమఠం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఎంపీపీ వీరనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మల్లేపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎల్‌సీ సభను విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 9,10 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న పౌరహక్కుల సంఘం 50 వసంతాల సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. ప్రొద్దుటూరులో బుధవారం సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా పౌర హక్కుల సంఘం సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పీడిత ప్రజల హక్కుల కోసం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సంఘం పోరాటం చేస్తోందని తెలిపారు.

డాక్టర్ సుధను గెలిపించండి

కలసపాడు : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకన గురివిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుదర్శన్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నారాయణయాదవ్ కోరారు. బుధవారం మండలంలోని పిడుగుపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సుధాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నిమ్మకాయల సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ప్రొద్దుటూరులో బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా సుధాకర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న ఈయన సేవలను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టారు. గతంలో ఈయన పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యదర్శిగా, ఏపీపీఎస్‌సీ సభ్యునిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాజీనామా చేసి తాను ఆ రోజుల్లోనే వైఎస్ జగన్ వెంట నడిచానన్నారు. నాటి నుంచి నేటి వరకు పార్టీ కోసం తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి


ప్రమాణస్వీకారం చేస్తున్న నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు

రాజుపాళెం : సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ చైర్మన్ ముక్కర్ల నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ఆయనతో పాటు కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం ప్రమాణ స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, యువ నాయకుడు ముడియం గౌతమ్‌రెడ్డి వచ్చారు. చైర్మన్‌గా నరసింహారెడ్డి, కమిటీ సభ్యులుగా పి.వెంకటరామిరెడ్డి, వై.సునీత, ఆర్.రాజేశ్వరమ్మ, టి.సురేష్, పి.వెంకటసుబ్బమ్మ, జి.సరిత, కేపీ గోవిందయ్యతో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఆర్ఆర్ నరసింహాసింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సుబ్బయ్య, సుభాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యానికి దోహదం

బద్వేలు అర్బన్ : జాబ్‌మేళాలు విద్యార్థుల నైపుణ్యానికి దోహదపడుతాయని ఎస్ఆర్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూనే ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి జాబ్‌మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుమారు 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ, ఏపీపీఎస్‌సీ, ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించిందని తెలిపారు. సుమారు 13 ప్రముఖ కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్‌మేళాలో 225 మంది నిరుద్యోగ యువతీయువకులు హాజరయ్యారని తెలిపారు. వీరిలో 75 మందికి ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీఓ నాగార్జున, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వినోద్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.